క్లుప్తంగా

స్పందించిన కార్మికులు

ఇల్లెందు: సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన ఓపెన్ బ్యాలెట్ పద్ధతికి అనూహ్య స్పందన లభించిందని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి అబ్బాస్ తెలిపారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఓపెన్ బ్యాలెట్ విధానాన్ని పరిశీలించగా ఇల్లెందులో 179 మందికి 176 మంది అనుకూలంగా ముగ్గురు వ్యతిరేకంగా ఓటు వేశారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని కోరారు.

ఎన్‌డీ పార్టీలో చేరిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న పార్టీలో ఆదివారం చర్ప కృష్ణ చేరారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ పార్టీ కండువా కప్పి కృష్ణను పార్టీలోకి ఆహ్వానించారు. ఇష్టు జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్యనానాయణ మాట్లాడారు. సురేందర్, వీరమల్ల ఉమ, సుగుణ పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏ ముట్టడి

ఇల్లెందురూరల్: మూడు రోజులుగా హాస్టల్, ఆశ్రమ పాఠశాలల డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం ఐటీడీఏను ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ అన్నారు. ఆదివారం బొజ్జాయిగూడెం, ఇల్లెందు బాలికల ఆశ్రమ పాఠశాలల ఎదుట మోకాళ్లపై కూర్చొని చేతిలో పువ్వు పట్టుకొని వర్కర్లు నిరసన తెలిపారు. నబీ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

హిందీ భాషా దివస్

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోమేరా యువ భారత్, సయ్యద్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ టి.అరుణకుమారి, షహజాన్‌ఖాన్ మాట్లాడుతూ భారతదేశంలో 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికార భాషగా గుర్తించిందుకు ప్రతీ సంవత్సరం హిందీ దివస్ నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను అధికారిక భాషగా స్వీకరించారని వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మను శాలువలతో సత్కరించి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి..

జూలూరుపాడు: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఉన్నత విద్యాసంస్థల నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల కాకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మా, ఎంబీఏ, బీఈడీ, నర్సింగ్ కళాశాల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

రక్షణ వైఫల్యంతోనే ప్రమాదం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): రక్షణ వైఫల్యం కారణంగానే భూపాలపల్లి కేటీకే-6 ఇంక్లైన్‌లో శనివారం ప్రమాదం జరిగిందని గోదావరి లోయ బొగ్గగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) గౌరవాధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తక్షణమే డీజీఎంఎస్‌చే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సింగరేణి రక్షణ సూత్రాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం లేదని, కార్మికవాడల్లో రోడ్లు, వాటర్, విద్యుత్, రవాణా, వైద్యం, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. కార్మిక నివాస ప్రాంతాలలో ఉన్న కంపెనీ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. వేలంపాటలో గనులను సాధిస్తామని, సాధించే గ్యారంటీ లేదన్నారు. ఒడిశాలో బ్లాక్ వల్ల సింగరేణి కార్మికులకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. మెడికల్ బోర్డ్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ అమలు చేసి, మారుపేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, హైపవర్ వేతనాలు, బోనస్ 40శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, వెంకన్న, బ్రహ్మానందం, ఎండీ రాసుద్దీన్, గొని నాగేశ్వరరావు, నరేష్, మల్లేష్, సిద్ధయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం

కంపుకొడుతున్న రాంనగర్
- డ్రెయినేజీలు లేక ఎక్కడికక్కడ నిల్వ ఉంటున్న మురుగు
- వర్షాకాలంలో కాలనీవాసుల ఇబ్బందులు వర్ణనాతీతం
- పట్టించుకోని అధికారులు



ధ్వంసం అయిన సైడుకాల్వలు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలోని రాంనగర్ ఏరియాలో పారిశుద్ధ్య పనులు కుంటుపడ్డాయి. దీంతో ఏ వీధిలో చూసినా కంపుకొడుతోంది. కాల్వల్లో మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేకపోవడంతో రోడ్లపై పారుతోంది. వర్షాకాలంలో వర్షపు నీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేదు. నెలల తరబడి సిల్ట్ తీయకపోవడంతో నిల్వలు భారీగా చేరాయి. ఇళ్లల్లో నుంచి కాల్వల్లో చేరే నీరు వీధుల్లో నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నచిన్న కాల్వల నుంచి మురుగు పెద్ద డ్రెయినేజీలలో కలిసే లింకు సరిగా లేక పోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. అంతేగాక అంతర్గత రోడ్లలో చెత్తకుప్పలు పేరుకు పోయాయి. నెలల తరబడి చెత్తకుప్పలు ఎత్తే దిక్కులేదు.

కంపు కొడుతున్న వీధులు..

కాలనీలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి డ్రెయినేజీలు కావడంతో చాలా వరకు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ పగిలిపోయాయి. పలుచోట్ల ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. దీంతో మురుగు వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ సిబ్బందికి ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోయాయి. పలుచోట్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయి. వాటివల్ల కూడా అక్కడి వాతావరణం కర్మభూమిని తలపిస్తున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు. కంప చెట్లు పెరిగి దోమలు, విషపు కీటకాలకు నిలయాలుగా మారాయి.

అనారోగ్యం బారిన పడుతున్న స్థానికులు..

పారిశుద్ధ్య పనులు చేపట్టక నెలలు గడుస్తుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కాలనీల్లో పర్యటిస్తే సమస్యలు అద్దం పడతాయని వాపోతున్నారు. ఇప్పటికై నా కొత్తగా పెద్ద డ్రెయనేజీలు నిర్మించాలని, మురుగు కాల్వల్లో సిల్ట్ ఎప్పటికప్పుడు తొలగించాలని, చిన్న కాల్వల్లోని నీరు పెద్ద కాల్వల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



చంద్రలాడ్జి వద్ద పేరుకు పోయిన చెత్త



డ్రెయినేజీలో పేరుకపోయిన మురుగు

కాలనీలో దుర్వాసన వస్తోంది..



రాంనగర్ ఏరియాలో సరైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదు. మురుగు కాల్వలను శుభ్రం చేయక నెలలు గడుస్తోంది. దీంతో కాల్వల్లో మురుగు పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇంట్లో నుంచి బయటకు వస్తే దుర్గంధంతో ముక్కు ముసుకోవాల్సి వస్తుంది.

– కవిరాజ్ చౌదరి, పాల్వంచ

అధికారులు దృష్టి సారించాలి..



కాలనీల్లో డ్రెయినేజీలు సరిగా లేవు. ఎక్కడిక్కడ పగిలిపోయాయి. చెత్త సేకరణకు సిబ్బంది సరిగా రావడం లేదు. కాల్వలు సరిగా లేక నీళ్ల నిల్వ ఉంటుండటంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి.

– కుమారి, పాల్వంచ

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా కిన్నెరసాని, కోడిపుంజలవాగు, పూసలతండా, రెడ్డిగూడెం, ఉలవనూరు పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందురూరల్: మస్సివాగు గ్రామపంచాయతీ ధర్మారం తండా గ్రామంలో వరద ప్రవాహం కోసం తన ఇంటి ప్రహరీని స్థానికులు 11 మంది కూల్చివేశారని ఆరోపిస్తూ దేవీలాల్ నాయక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం కురిసిన భారీ వర్షంతో గ్రామంలోకి చేరిన వరదనీటిని పంట చేలల్లోకి మళ్లించేందుకు తన అనుమతి లేకుండా గోడను పగలగొట్టారని, ఫలితంగా గోడ మొత్తం కూలిపోయిందని, పక్కనే ఉన్న తన చేనులో కొంత మేర పంట కొట్టుకుపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు దేవీలాల్ వివరించాడు.

సింగరేణి గైర్హాజరు కార్మికులపై వేటు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 2024లో గైర్హాజరు కనీసం 100 మస్టర్లు చేయని కార్మికులపై యాజమాన్యం కొరడా ఝుళిపించనుంది. సింగరేణి సంస్థలో ఉద్యోగిగా కొనసాగాలంటే అండర్ గ్రౌండ్ కార్మికులు 190 మస్టర్లు, సర్వీస్ విభాగాలలో పనిచేసే ఉద్యోగులు 240 మస్టర్లు చేయాలని కంపెనీ నిబంధనలు ఉన్నాయి. అయితే ఇటీవల డిపెండెంట్ ఉద్యోగులు సుమారు 18 వేల మంది కంపెనీలో వారసత్వ ఉద్యోగాల్లో చేరారు. వీరిలో చాలామంది గైర్హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీ 190 మస్టర్ల సంఖ్యను కాస్తా 100 మస్టర్లుకు కుదించి నిబంధనలు విధించింది. అయినా సింగరేణి వ్యాప్తంగా 2024లో 76 మంది కనీసం 100 మస్టర్లు కూడా చేయలేదు. కొత్తగూడెం ఏరియాలోని పీవీకేలో 62 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే వీరిలో 25 మందిని డిస్మిస్ చేస్తున్నట్లు అదేశాలు జారీ చేసి వివరాలు కోరుతూ మీడియా ప్రకటనలు ఇచ్చారు.

స్పెషల్ డ్రైవ్...

2024లో 100 మస్టర్ల కంటే తక్కువ చేసిన వారికోసం యాజమాన్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. వారు స్థానికంగా ఉంటున్నారా.. ఇతర ప్రాంతాలకు వెళ్లారా.. వీరికి కేటాయించిన క్వార్టర్ వివరాలను సేకరిస్తున్నారు. అంతేకాకుండా కొంత మందికి చార్జిషీట్ ఇచ్చి విచారణ చేయిస్తున్నామని, ఇది చివరి అవకాశం, ఇది మిస్ చేసుకుంటే భవిష్యత్‌లో వారికి సింగరేణిలో ఉద్యోగం రాదని ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజు తెలిపారు.

సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని 17వ వార్డు న్యూగొల్లగూడెంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జమిందారీ, దోపిడీ, అన్యాయాలపై పేదరైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. ఇలాంటి మహత్తర పోరాటాన్ని కేంద్రంలోని మోదీ సర్కార్ హైజాక్ చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సామాజిక న్యాయం కోసం ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమాలకు తెలంగాణ సాయుధ పోరాటం మార్గదర్శకమని చెప్పారు. ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిన సాయుధ పోరాటాన్ని విలీన దినోత్సవంగా ఎందుకు జరపలేకపోతున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, అమరవీరుల స్మారక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. కంచర్ల జమలయ్య, నేరెళ్ల రమేష్, కళ్యాణి, మాచర్ల శ్రీనివాస్, పురుషోత్తం, దుర్గ, అమస్, పుష్పలత, అస్మత్, ముక్తార్ పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న లంబాడీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోయవర్గం దుష్ప్రచారాన్ని ఖండిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి బస్టాండ్ మీదుగా పోస్టాఫీస్ వరకు జరిగింది. జేఏసీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే లంబాడీలు ఎస్టీలుగా గుర్తించబడినట్లు తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం కుట్ర చేస్తే అన్నదమ్ములుగా ఉన్న వాళ్లం ఆగం కావొద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు రావాల్సిన వాటా కోసం అన్నదమ్ములుగా కలిసి ఉద్యమిద్దామన్నారు. లంబాడీలు అక్రమంగా వచ్చారా, సక్రమంగా వచ్చారా అనే విషయాన్ని ప్రభుత్వం ప్రకటన చేయక పోవడం గర్హనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి వీడాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆత్మగౌరవ పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ లంబాడీ సంఘాల నాయకులు డాక్టర్ శంకర్‌నాయక్, గుగులోత్ రాజేష్, భూక్యా సంజీవ్, బానోత్ రమేష్, లావుడ్యా ప్రసాద్, హుస్సేన్, వీరూ, లాల్‌సింగ్, రమేష్ రాథోడ్, ఇస్లావత్ లక్ష్మణ్, ఈరు, భాస్కర్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలి వెళ్లిన నాయకులు

పాల్వంచ: ఆదివారం కొత్తగూడెంలో చేపట్టిన ర్యాలీ పాల్వంచ నుంచి నాయకులు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బానోతు భరత్ నాయక్, రాందాస్ నాయక్, దేవీలాల్ నాయక్, కుష నాయక్, ఉపేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కొత్తగూడెంలో జరిగిన లంబాడీల ఆత్మగౌరవ మహార్యాలీకి జూలూరుపాడు మండలానికి చెందిన లంబాడీ బంజారాలు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో గుగులోత్ కేశ్యా, లకావత్ నాగేశ్వరరావు, బానోత్ నవీన్ రాథోడ్, బానోత్ దుర్గాప్రసాద్, బానోత్ లక్ష్మణ్, బానోత్ హరిలాల్, ధరావత్ బాలాజీ, హలావత్ రఘు, గుగులోత్ శ్రీను, హళావత్ నరసింహారావు, బానోత్ రాంజీ, భూక్యా అమ్మ, భూక్యా చరణ్ నాయక్, గుగులోత్ హరి, రాందాస్, రాంబాబు, బానోత్ శాంతిలాల్, కిషన్, వీరన్న, బోడా భీమారావు, ధరావత్ లక్ష్మణ్, బోడా శాంతిరామ్, శ్రీధర్, అజ్మీర రాంబాబు, సురేష్, బాదావత్ రాంకోటి, భూక్యా రాములు, భూక్యా జవహర్‌లాల్, వెంకట్రామ్ ఉన్నారు.

స్ట్రక్చరల్ సమావేశాల్లో పాల్గొనం..



మాట్లాడుతున్న వెంకట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ఒంటెద్దు పోకడతో గతంలో ఒప్పుకున్న అంశాలకు సర్క్యులర్ జారీ చేసే వరకు సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాల్లో ఏఐటీయూసీ పాల్గొనదని ఆ యూనియన్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ అన్నారు. ఆదివారం శేషగిర భవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో సర్కార్ సంఘం కార్మికులను తప్పుదోవ పట్టిస్తోందని, కార్మికుల అండతో పోరాటాలు చేసి ఎన్నో హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్న విషయం ప్రాతినిధ్య సంఘం తెలుసుకోవాలన్నారు. యాజమాన్యం మొండికేస్తే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు పిలుపునిస్తామన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన నాటి నుంచి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు యాజమాన్యానికి లేఖలు రాయటం జరిగిందని, వాటిపై ఇప్పటికీ రెండుసార్లు, డైరెక్టర్(పా) స్థాయి, ఒకసారి సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ కమిటీ సమావేశాలు జరిగాయని అందులో కొన్ని సమస్యలను అంగీకరించిన యాజమాన్యం ఇంత వరకు సర్క్యులర్ జారీ చేయలేదన్నారు. సమస్యలు పరిష్కారం కాలేదని కొన్ని కార్మిక సంఘాలు పనిగట్టుకొని అనవసరపు విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రధానంగా ఐఎన్‌టీయూసీ అధికారులను బెదిరిస్తూ అడ్డుకున్న ఏఐటీయూసీని బద్నాం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా యాజమాన్యంపై ఐఎన్టీయూసీ నాయకులు ఒత్తిడి చేయటం వల్ల సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. సింగరేణిలో ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కార్మికుల అండతో పోరాటాలు, ఉద్యమాలు చేసి.. హక్కులు సాధించే దమ్ము, ధైర్యం ఒక్క ఏఐటీయూసీకే ఉందన్నారు. వెంటనే లాభాల్ని ప్రకటించి 35శాతం వాటా పంపిణీ చేయాలని లేదంటే సమ్మె తప్పదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రమణమూర్తి, గట్టయ్య, వీరస్వామి, సామల రాము, క్రిష్టాఫర్, నాగయ్య, హ్యూమాయిన్ పాల్గొన్నారు.

సింగరేణిలోనూ ఎక్స్‌గ్రేషియా పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): దేశంలోని బొగ్గు గనుల్లో కోలిండియాలో ప్రమాదవశాత్తు మరణాలకు ఎక్స్‌గ్రేషియా రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు జరిగిందని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన 2024 న్యూఢిల్లీలో నిర్వహించిన బొగ్గగనుల భద్రతపై స్టాండింగ్ కమిటీ 49వ సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధి సూచనల మేరకు.. బొగ్గు తవ్వకం సహజంగానే ప్రమాదమైందని ప్రతీ సంవత్సరం పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తితో కార్మికులలో ఆందోళన మరింతగా పెరిగిందన్నారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు కోలిండియా లాగా సింగరేణిలోనూ రూ. 25 లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని బొగ్గు కంపెనీలలో పరిహార విధానాలు ఒకే మాదిరిగా వర్తింపజేయాలని కోరారు. ఉదాహరణకు ఎన్‌సీఐఎల్ ప్రమాదంలో మృతి చెందిన మూడు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. నిరంతర పోరాటాల ఫలితంగానే కోలిండియాలో ఎక్స్‌గ్రేషియా పెరిగిందని, ఈ విధానం సింగరేణిలో కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులపై కేసు ఎత్తివేయండి..



ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ఇల్లెందు: ఖమ్మం పట్టణంలో ఇరువురు జర్నలిస్టులపై అక్రమంగా బనాయించిన కేసు ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) డిమాండ్ చేసింది. ఆదివారం ఇల్లెందు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జేకే బస్టాఫ్ ఏరియాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుర్రం రాజేష్ మాట్లాడుతూ ఈ నెల 11న వార్త సేకరణకు వెళ్లిన ఇరువురు జర్నలిస్టులు సాంబశివరావు, నాగరాజుల మీద అక్రమంగా బనాయించిన కేసును ఎత్తివేయాలని కోరారు. యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వారికి సరిపడా యూరియా అందించలేని ప్రభుత్వం యూరియా కవరేజీ కోసం వెళ్లిన ఇరువురు జర్నలిస్టుల మీద అక్రమంగా కేసు బనాయించారని పేర్కొన్నారు. డానియేల్, రాజశేఖర్, సంతోష్, శేషు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కోనేరు సత్యనారాయణ, తదితరులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం పవర్ హౌస్ జిమ్ నిర్వాహకులు షమీఉద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీర దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అనంతరం బెంచ్ ప్రెస్ పోటీలను వీక్షించారు. జిల్లా నలుమూలల నుంచి 100 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ లసోసియేషన్ అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి, యామిని మల్టీ స్పెషాలిటీ డాక్టర్లు యామినీకుమారి, నరసింహా, సంజీవ్‌కుమార్, ఉమ్మళ్ల మల్లేష్ యాదవ్, కావేటి రమేష్, హైమద్, మాలోతు రాజా, వై.శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుక్కలతో జనం బెంబేలు

- గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- రోడ్డెక్కేందుకు జంకుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



సుజాతనగర్‌లో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

సుజాతనగర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు దాడులకు తెగబడుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటే మండలంలో ప్రజలు హడలిపోయే పరిస్థితి నెలకొంది.

గుంపులుగా సంచరిస్తూ..

కొత్తగూడెం కార్పొరేషన్‌లో నాలుగు డివిజన్లతో పాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. బయటకు వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 20 నుంచి 30 కుక్కలు ఒకే దగ్గరికి చేరుతుండటంతో అటు వైపుగా వెళ్లే వారు జంకుతున్నారు. బైకులు, సైకిళ్లపై వెళ్లేటప్పుడు కూడా కుక్కలు వెంటపడుతుండటంతో వాహనాలు అదుపు తప్పి కిందపడుతున్నారు. దీంతో పాటు గ్రామాల్లో సంచరించే కొన్ని కుక్కలకు వైరస్ సోకడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కుక్కలు జనావాసాల్లో తిరుగుతుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కుక్కలను పూర్తిగా నియంత్రించాలని మండల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

సర్పంచ్‌లు లేకపోవడంతో..

గ్రామస్థాయిలో సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రజలకు మరింత పెద్ద సమస్య వచ్చిపడినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏ సమస్యకైనా సర్పంచ్‌లు స్పందించేవారని, ప్రస్తుతం ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వందల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా ప్రత్యేకాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చికెన్ సెంటర్ల వద్ద మకాం వేస్తూ..

ఆయా గ్రామాల్లో చికెన్, మటన్ పలు దుకాణాలు వెలిసాయి. వీటి వద్ద వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు రాత్రి సమయాల్లో అరుస్తూ కలబడుతూ నిద్ర లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కుక్కకాటు బాధితులు కూడా పెరిగినట్లు వైద్యులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి నెలలో దాదాపు 40 కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. మనుషులతో పాటు, పాడి పశువులపైనా దాడులకు దిగుతున్నాయి. గతంలో జీపీల ఆధ్వర్యంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది.

సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రిలో నమోదైన కుక్కకాటు కేసులు

సంవత్సరం	కేసులు	సంవత్సరం	కేసులు
2020	393	2023	379
2021	417	2024	382
2022	337	2025	251

కుక్కల బెడద నుంచి కాపాడాలి..



గ్రామాల్లో కుక్కల బెడద పెరిగింది. కుక్కల్లో వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో ఆందోళన తప్పడం లేదు. అధికారులు దృష్టి సారించాలి. వైరస్ సోకిన కుక్కలను పట్టుకొని దూర ప్రాంతాలకు తరలించాలి.

– మురిపిటి గణేష్, రాఘవాపురం

వెంటబడుతున్నాయి..



పాఠశాలకు వెళ్తున్న చిన్నారులను కుక్కలు వెంటాడి భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను వెంబడిస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకుని గ్రామంలో కుక్కలు లేకుండా చూడాలి.

– అజ్మీరా కిరణ్‌కుమార్, జామ్లాతండా